ప్రజాశక్తి
మంగళవారం 31 అక్టోబర్ 2023 5
పార్వతీపురం మన్యం



బూర్జ వద్ద మరో వంతెన

ప్రజాశక్తి - సీతానగరం

మండలంలోని బూర్జ వద్ద సువర్ణముఖి నదిపై మరో వంతెన నిర్మాణానికి ప్రభుత్వం అనుమతులు ఇచ్చిందని స్థానిక ఎమ్మెల్యే ఎ.జోగారావు తెలిపారు. ఈ మేరకు విలేకరులతో ఆయన మాట్లాడుతూ రాష్ట్ర పరిధిలో రోడ్లు, వంతెనలు, భవనాలు తదితర 202 పనుల నిర్మాణాలకు రూ.784.23కోట్ల పరిపాలనపరమైన అనుమతులు కేటాయిస్తూ పంచాయతీ రాజ్, రూరల్ డెవలప్మెంట్ ప్రత్యేక కార్యదర్శి రాజశేఖర్ సోమవారం ఉత్తర్వులు జారీచేశారని తెలిపారు. ఈ అనుమతుల్లో నియోజకవర్గంలోని రెండు పనులకు అనుమతులను ప్రభుత్వం మంజూరు చేసినట్లు ఆయన చెప్పారు. సీతానగరం మండలంలోని సువర్ణముఖినదిపై బూర్జ-చినఅంకలాం మధ్యలో అరకిలోమీటరు పొడవున వంతెన నిర్మాణానికి రూ.9కోట్లు మంజూరైనట్లు చెప్పారు.



ఒక్కసారి భారీ శబ్దం

రైలు ప్రమాదం జరిగిన సమయంలో భారీ శబ్దం రావడంతో సమీప గ్రామాలైన అలమండ ప్రజలు ఒక్కసారిగా ఉలిక్కి పడ్డారు. తొలుత ఇంటి నుంచి బయటకు పరుగులు తీశామని, అరగంట దాటిన తర్వాత గ్రామానికి రైలు ప్రమాద బాధితులు తండోప తండాలుగా రావడం మొదలు పెట్టారని తెలిపారు. విషయం తెలుసుకుని యువకులు సంఘటనా స్థలానికి పరుగులు తీశామని అలమండ గ్రామస్తులు తెలిపారు. సంఘటనా స్థలంలో ఏడుపులు, ఆర్తనాదాలు రక్తం మడుగులో భీతిల్లిన ప్రయాణికులను చూసి మనసు చలించి పోయిందని ప్రత్యక్ష సాక్షులు తెలిపారు.

పట్టాలపై నలిగిన బతుకులు

క్షతగాత్రులకు సిఎం పరామర్శ


ఆస్పత్రిలో బాలుడిని పరామర్శిస్తున్న సిఎం జగన్

ప్రజాశక్తి-విజయనగరంటౌన్, కోట

రైలు ప్రమాదంలో గాయపడి జిల్లా కేంద్రాస్పత్రిలో చికిత్స పొందుతున్న క్షతగాత్రులను ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి, మంత్రులు బొత్స సత్యనారాయణ, గుడివాడ అమర్నాథ్ పరామర్శించారు. బాధితులు, వారి కుటుంబసభ్యులకు అండగా నిలుస్తామని సిఎం హామీ ఇచ్చారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న 29 మంది క్షతగాత్రుల వద్దకు వెళ్లి పరామర్శించారు. రైలు ప్రమాదం జరిగిన తీరు, వైద్య సదుపాయంపై ఆరా తీశారు. వారిని ఓదార్చారు. ప్రమాదం జరిగిన తీరును, తీసుకున్న సహాయ చర్యలను మంత్రి బొత్స సత్యనారాయణ, జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి, రైల్వే ఉన్నతాధికారులు సిఎంకు వివరించారు.

మెరుగైన వైద్యసేవలందించాలి : సిపిఎం

రైలు ప్రమాదంలో గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాధితులకు మెరుగైన వైద్య సేవలందించాలని సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యులు బివి రాఘవులు, రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు అన్నారు. క్షతగాత్రులను, కుటుంబ సభ్యులను ఆ పార్టీ జిల్లా కార్యదర్శి తమ్మినేని సూర్యనారాయణతో కలిసి పరామర్శించారు. ఆసుపత్రి సూపరింటెండెంట్ సలందతో మాట్లాడి బాధితులకు అందుతున్న వైద్యం గురించి తెలుసు కున్నారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ రైలుప్రమాదం జరగడం చాలా బాధాకరమని అన్నారు. క్షత గాత్రులలో పలువురికి తీవ్రమైన దెబ్బలు, ఇద్దరికి మెదడకు దెబ్బలు తగిలాయన్నారు.


నుజ్జునుజ్జయిన రైలు భోగీలు

- 13కు చేరిన రైలు ప్రమాద మృతులు
- మృతదేహాలు కుటుంబీకులకు అప్పగింత
- ఆస్పత్రిలో క్షతగాత్రులను పరామర్శించిన సిఎం, మంత్రులు, సిపిఎం నాయకులు

ప్రజాశక్తి - జామి

రెండు రైళ్లు ఢీకొన్న ఘటనలో మృతి చెందిన వారి సంఖ్య 13కు చేరింది. 40 మంది వరకు గాయపడినట్లు అధికారుల లెక్కలు తేల్చారు. మృతుల్లో ఎక్కువ మంది కూలి పనులు చేసుకొని జీవనం సాగించేవారే కావడంతో ఆయా కుటుంబాల్లో తీవ్ర విషాదం అలముకుంది. మృతుల్లో ఏడుగురు విజయనగరం జిల్లా వారు కాగా, ముగ్గురు శ్రీకాకుళం, ఇద్దరు విశాఖ జిల్లాకు చెందిన వారు ఇద్దరు, కర్నూలుకు చెందిన వారు ఒకరు ఉన్నారు. జిల్లాకు చెందిన మృతుల్లో గరివిడి మండలం కాంపు శంబాం, గదబవలసకు చెందిన ఇద్దరు, శ్రీకాకుళం జిల్లా జి.సింగడాంకు చెందిన ఇద్దరు ఉండడంతో ఆయా మండలాల్లో విషాదఛాయలు నెలకొన్నాయి. రాయగడ పాసింజర్ రైలు డ్రైవర్, లోకోపైలెట్, పలాస రైలుగార్డు మృతి చెందడంతో రైల్వే ఉద్యోగుల్లో సైతం విషాదం అలముకుంది. గార్డు ఎం. శ్రీనివాసరావుది మన్యం జిల్లా. విజయనగరానికి చెందిన సతీష్ మృతుల్లో ఉన్నారు. సతీష్‌కు ఇటీవలే వివాహం కావడంతో ఆయా కుటుంబాల్లో తీవ్ర విషాదం నెలకొంది.

కంటకాపల్లి-అలమండ మధ్య రైల్వేట్రాక్‌పై ఆగి ఉన్న విశాఖ-పలాస పాసింజర్ రైలును, ఆ వెనుక వస్తున్న విశాఖ-రాయగడ పాసింజర్ రైలు ఢీకొన్న విషయం తెలిసిందే. పట్టాలు తప్పిన వీటి బోగీలు పక్క ట్రాక్‌పై ఆగి ఉన్న గూడ్సురైలు బోగీలపైకి దూసుకెళ్లడంతో పట్టాలు పైకి లేచాయి. ఈ ప్రమాదంలో ఆదివారం రాత్రి 10 మంది మృతదేహాలను బయటకు తీసిన సహాయక బృందాలు... సోమవారం ఛిద్రమైన రైలు భోగీలను కట్ చేసి రాయగడ పాసింజర్ రైలు లోకో పైలెట్ మృతదేహంతో పాటు మరో ఇద్దరి మృతదేహాలకు వెలికితీశాయి. రైలు ప్రమాదంలో మృత్యువాత పడ్డవారిలో, క్షతగాత్రులైన వారిలో కూలి పనులు చేసుకునే వారే ఎక్కువ. ప్రమాదం జరిగిన సమయంలో చుట్టుపక్కల గ్రామాల ప్రజలు పరుగున వెళ్లి సహాయక చర్యలు చేపట్టడంతో కొంత వరకు ప్రాణ నష్టాన్ని తగ్గించారని బాధితులు చెబుతున్నారు.

రైల్వే జిఎం ఆధ్వర్యాన ట్రాక్ పునరుద్ధరణ

కొత్తవలస : రైల్వే జిఎం మనోజ్ శర్మ వాల్తేరు డిఆర్ఎం సౌరబ్ ప్రసాద్ నేతృత్వంలో ఆదివారం రాత్రి నుంచి సిబ్బంది హుటాహుటిన దెబ్బతిన్న బోగీల తొలగింపు చర్యలు చేపట్టారు. ఇప్పటికే ఈ లైన్ మీదుగా ప్రయాణించే పలు రైళ్లను దారి మళ్లించడంతో పాటు వివిధ రైళ్ల రాకపోకలను రద్దు చేస్తూ రైల్వే శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ నేపధ్యంలో ట్రాక్ పునరుద్ధరణ పనులను భారీ క్రైన్ల సహకారంతో ముమ్మరం చేశారు. ట్రాక్ పై శిథిలాలను పూర్తిగా తొలగించి, రెండు ట్రాక్‌లను పునరుద్ధరించారు. దీంతో సాయంత్రం నుంచి పలు రైళ్లు ఆలస్యంగా నడిచాయి.

ఘటనా స్థలంలో సహాయక చర్యలను డిప్యూటీ సిఎం మంత్రి బూడి ముత్యాలు నాయుడు పరిశీలించారు.

హృదయ విదారకరం

క్షతగాత్రులకు సర్వజన ఆస్పత్రిలో చికిత్స

కంటకాపల్లి సమీపంలో జరిగిన రైలు ప్రమాదంలో గాయపడిన వారిలో 29 మంది జిల్లా కేంద్ర సర్వజన ఆస్పత్రిలో చికిత్సపొందుతున్నారు. క్షతగాత్రుల వివరాలకు వారి కుటుంబ సభ్యులకు తెలియక కొందరు ఇబ్బందులు పడుతుంట.. సమాచారం తెలిసిన వారు ఆస్పత్రికి చేరుకొని సపర్యలు చేస్తున్న వారు కొందరు. మరోవైపు మృతదేహాలకు ఆస్పత్రి మార్చురీకి చేరుకోవడంతో ఆ ప్రాంతం ఆర్తనాదాలతో మార్మోగి పోయింది. మరోవైపు పరామర్శకు వస్తున్న అధికారులకు, పలు పార్టీల నాయకులకు అంతే ఆవేదనతో బాధితులు జరిగిన సంఘటనను వివరించడం తో వారి హృదయాలు బరువెక్కాయి.

\- ప్రజాశక్తి, విజయనగరంకోట, టౌన్


ఆస్పత్రి వద్ద తీవ్ర విషాదంలో మృతుల బంధువులు

తండ్రి, తల్లి, కుమార్తెకు గాయాలు

విశాఖలో గాజువాకకు చెందిన జక్కలి వెంకట రమణ, భార్య బంగారు తల్లి, ఐదేళ్ల కుమార్తె కోమలి రైలు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందు తున్నారు. తల్లి తీవ్రంగా గాయపడగా, చిన్నారి కోమలి చేయి విరిగి పోయింది. ఈ నేపథ్యంలో ముగ్గురూ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. వారిని చూసిన వారి హృదయాలు చలించిపోయాయి.


రమణ కుటుంబాన్ని పరామర్శిస్తున్న సిపిఎం నేతలు బివి రాఘవులు, వి.శ్రీనివాసరావు

కుటుంబ సభ్యులకు సమాచారం లేక..


చికిత్స పొందుతున్న బుజ్జి

సీతంపేట మండలం పెదవంగరకు చెందిన సవర బుజ్జి (16) తలకు తీవ్ర గాయమై ఆస్పత్రిలో చికిత్స పొందుతోంది. ఉపాధి కోసం కర్నాటకలో పనిచేస్తున్న ఆమె.. అధోనిలో పని చేస్తున్న తన అన్న రాయ్యప్పతో కలిసి స్వగ్రామం వస్తోంది. ఇంతలో ప్రమాదం జరగడంతో ఇద్దరూ గాయపడ్డారు. ఆమె అన్నయ్యను విశాఖ కెజిహెచ్‌కు తరలించగా, బుజ్జిని విజయనగరం తరలించారు. ఆమె సమాచారం కుటుంబ సభ్యులకు తెలియక పోవడం, ఆమె చెప్పిన ఫోన్ నెంబరు పనిచేయకపోవడంతో దిక్కుతోచని స్థితిలో ఆస్పత్రిలో దీనంగా తమ వారి కోసం ఎదురుచూస్తున్న ఘటన అందరినీ కలచివేసింది. విషయం తెలుసుకున్న ఎస్ఎఫ్ఐ, డివైఎఫ్ఐ నాయకులు ఆమె కుటుంబీలకు సమాచారం ఇవ్వడంతో సాయంత్రం వారు ఆస్పత్రికి చేరుకున్నారు.

సమస్యలకు తక్షణ పరిష్కారం

ప్రజాశక్తి - బెలగాం

జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో ప్రజలు తెలియజేసిన సమస్యల పరిష్కారానికి అధికారులు తక్షణ చర్యలు తీసుకోవాలని కలెక్టరు నిశాంత్‌కుమార్ అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా కలెక్టరు కార్యాలయ సమావేశమందిరంలో నిర్వహించిన జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో జాయింటు కలెక్టరు ఆర్.గోవిందరావు, ఐటిడిఎ పిఒ సి.విష్ణుచరణ్, డిఆర్ఒ జె.వెంకటరావుతో కలిసి ప్రజల నుండి వినతులు స్వీకరించారు. జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో ప్రజలు తెలియజేసిన సమస్యల గురించి సంబంధిత జిల్లా, మండల అధికారులతో నేరుగా మాట్లాడి సమస్యల పరిష్కారానికి ఆదేశాలు జారీచేశారు. అర్జీలపై సకాలంలో స్పందించి, చర్యలు తీసుకోవాలన్నారు. పాలకొండ మండలం కోమటిపేటకు చెందిన చల్లా నాగభూషణరావుకు జాయింటు కలెక్టరు ఆర్. గోవిందరావు వినికిడియంత్రాన్ని అందజేసారు. కార్యక్రమంలో ప్రజలు పలు సామాజిక, వ్యక్తిగత అంశాలపై 156 అర్జీలు అందజేశారు. కార్యక్రమంలో వివిధశాఖల జిల్లా ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

ఐటిడిఎ స్పందనకు 38 వినతులు

సీతంపేట : స్థానిక ఐటిడిఎ స్పందనకు 38 వినతులు వచ్చాయి. పిఒ కల్పనా కుమారి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమంనిర్వహించారు. కన్నయ్యగూడకు చెందిన సన్నాయి రోడ్డు మంజూరు చేయాలని, రెల్లిగూడకు చెందిన బంగారమ్మ సామాజిక భవనం మంజూరు చేయాలని కోరారు. పక్కిణిగూడ చెందిన రామారావు పాలకొండ పెట్రోల్ బంకులు ఉద్యోగం ఇప్పించాలని, పాతపట్నం మండలం దాసుపురం చెందిన జగదీష్ ఏదైనా ఉద్యోగం ఇప్పించాలని, కిరపకు చెందిన జయశ్రీ కుట్టు మిషన్ ఇప్పించాలని, సంకిలి చెందిన బాలాజీ ఆర్థిక సహాయం అందించాలని వినతిని అందజేశారు. వజ్రైగూడెంకు చెందిన బాలరాజు కిరాణా షాపు మంజూరు చేయాలని కోరారు. స్పందన కార్యక్రమంలో ఎపిఒ రోసిరెడ్డి, జిసిసి డిఎం సంధ్యారాణి, డిప్యూటీ డిఎంహెచ్ఒ విజయపార్వతి, డిప్యూటీ డిఇఒ లిల్లీరాణి, సిడిపిఒ రంగలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

పోటెత్తిన యాత్రికులు

పైడితల్లమ్మను దర్శించుకున్న అశోక్, కోలగట్ల, మజ్జి

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

పైడితల్లమ్మ ఉత్సవ సందడి మొదలైంది. తొలిరోజు సోమవారం తొలేళ్ల ఉత్సవం వైభవంగా జరిగింది. అమ్మవారి దర్శనానికి యాత్రికులు పోటెత్తారు. ఉదయం నుంచి దర్శనం కోసం కిలోమీటర్ల క్యూలో నిలబడ్డారు. ఘటాలతో మొక్కులు తీర్చుకునేందుకు భారీగా తరలివచ్చారు. ఆలయం నుంచి రోడ్డుకు కుడి వైపు అర్బన్ బ్యాంకు వరకు యాత్రికులు క్యూలో ఉన్నారు. ఎంజి రోడ్డు వైపు చందన బ్రదర్స్ షాపు వరకు బారులుతీరారు. తొలేళ్ల ఉత్సవం సందర్భంగా విచిత్ర వేషధారణలు, వాయిద్యాలతో పండగ శోభ నెలకొంది. ఆలయ ధర్మకర్త పూసపాటి అశోక్ గజపతి రాజు కుటుంబ సభ్యులతో కలిసి పట్టువస్త్రాలు సమర్పించారు. డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి, జెడ్‌పి చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు కుటుంబ సభ్యులతో కలిసి అమ్మవారిని దర్శించుకున్నారు. డిసిఎంఎస్ చైర్‌పర్సన్ అవనాపు భావన, విక్రమ్ దంపతులు, బంధుమిత్రులతో కలిసి ఘటాలతో ఆలయానికి చేరుకున్నారు. ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు.

పట్టువస్త్రాలు సమర్పించిన అశోక్

పైడితల్లమ్మ పండగ సందర్భంగా సోమవారం అమ్మవారికి ఆలయ ధర్మకర్త పూసపాటి అశోక్‌గజపతిరాజు పట్టు వస్త్రాలను సమర్పించారు. కుటుంబ సమేతంగా అమ్మవారిని దర్శించుకున్నారు. అనంతరం అశోక్ మీడియాతో మాట్లాడుతూ పైడితల్లమ్మ ముందు అందరూ సాధారణ భక్తులేనని, అధికారం, అహం అమ్మవారి ముందు


ఆలయంలో పూజలు చేస్తున్న అశోక్ దంపతులు

చూపించకూడదని వ్యాఖ్యానించారు. తానెప్పుడూ మర్యాదలకు పెద్దపీట వేయలేదన్నారు. గతేడాది అనేక అపశ్రుతులు చోటుచేసుకున్నాయని, ఈ ఏడాది అలా జరగ కుండా ఉంటుందని ఆశిస్తున్నానని చెప్పారు. సిరి మాను సరైన సమయానికి తిప్ప గలిగితే యాత్రికులు సంతోషిస్తారని, ఈ విషయంలో ప్రభుత్వం బాగా పనిచేయాలని సూచించారు. విజయనగరం ఉత్సవాలకు అందరికీ ఆహ్వానం ఇవ్వాలా? వద్దా అనేది ఎమ్‌పి, ఎమ్మెల్యేల నిర్ణయమని అభిప్రాయపడ్డారు.

రైల్వే వ్యవస్థ పనితీరు మెరుగుపడాలి

జిల్లాలో రైలు ప్రమాదం జరగడం విచారకరమని అశోక్ అన్నారు. మృతుల కుటుంబాలను, గాయపడిన వారిని మానవత్వంతో ఆదుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. అమాయకుల ప్రాణాలు పోకుండా ప్రభుత్వం రైల్వే వ్యవస్థ పనితీరు మెరుగుపర్చాలని, ఇలాంటి ఘటనలు జరగకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు.

సామాజిక యాత్ర కాదు.. సంహారయాత్ర

- ప్రజారక్షణ భేరిలో సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యులు బివి రాఘవులు
- అమలుకాని హామీలపై సిఎం వివరణ ఇవ్వాలి
- సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి. శ్రీనివాసరావు
- ఉత్సాహంగా ప్రారంభమైన బస్సు యాత్ర
- పార్వతీపురం, కురుపాంలో ఘన స్వాగతం

జిల్లాలో సిపిఎం ఆధ్వర్యంలో చేపట్టిన ప్రజా రక్షణ బేరి బస్సుయాత్ర ఉత్సాహాన్ని నింపింది. గిరిజన, రైతాంగ, ఉద్యోగ, కార్మిక వర్గాలను ఆలోచింప చేసింది సీతంపేటలో ప్రారంభమైన బస్సుయాత్ర పాలకొండ, కురుపాం మీదుగా పార్వతీపురం వరకు సాగింది. కురుపాం పార్వతీపురం కేంద్రాల్లో యాత్ర బృందానికి ఘన స్వాగతం లభించింది. కురుపాంలో గిరిజన సాంప్రదాయ నృత్యం డప్పు వాయిద్యాలతో స్వాగతం పలికారు. పార్వతీపురంలో కోలాటంతో స్వాగతం పలుకుతూ నాయకులకు తిలకం దిద్దారు. ఈ రెండు చోట్ల సాగిన ప్రదర్శనలలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అవలంభిస్తున్న ప్రజా వ్యతిరేక నినాదాలు మారు మోగాయి. ప్రభుత్వాలు అవలంభిస్తున్న ప్రజా కార్మిక గిరిజన రైతాంగ వ్యతిరేక విధానాలపై ప్రజానాట్యమండలి కళాకారులు నృత్యాలు ప్రదర్శించారు.



ప్రదర్శనలో పాల్గొన్న సిపిఎం నేతలు బివి రాఘవులు, వి.శ్రీనివాసరావు, నాయకులు, పార్టీ శ్రేణులు


సిపిఎం నాయకులకు తిలకం దిద్ది స్వాగతం పలుకుతున్న మహిళలు

ప్రజాశక్తి -కురుపాం, పార్వతీపురం

ఈ సందర్భంగా కురుపాం, పార్వతీపురంలో ఆ పార్టీ జిల్లా కార్యదర్శి రెడ్డివేణు, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కె. అవినాష్ అధ్యక్షతన జరిగిన బహిరంగ సభల్లో వక్తలు మాట్లాడారు. తొలుత సిపిఎం పోలీస్ బ్యూరో సభ్యులు బివి రాఘవులు మాట్లాడుతూ రాష్ట్రంలో వైసిపి చేపడుతున్నది సామాజిక సాధికార యాత్ర కాదని సామాజిక సంహార యాత్ర అంటే సరిపోతుందని కితాబు ఇచ్చారు. రాష్ట్రంలో అన్ని తరగతులనూ మోసం చేస్తున్న బిజెపికి వంతపాడి తిరిగి అదే ప్రజలకు సాధికారత కల్పిస్తున్నామన్నడం సిగ్గుచేటు అన్నారు. సిఎం జగన్ వైఖరి వల్ల రాష్ట్రం మునుపెన్నడూ లేనంత నిర్లక్ష్యానికి గురైందని అన్నారు. టిడిపి కూడా రాజకీయంగా ఎదుర్కోవడం తప్ప ప్రజల సమస్యలు పట్టలేదని విమర్శించారు. ఈ విషయాలను ప్రజలకు తెలియజేసేందుకు ప్రజారక్షణ బేరి పేరిట తమ పార్టీ ఆధ్వర్యంలో బస్సు యాత్ర చేపడుతున్నామని తెలిపారు.

సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి. శ్రీనివాసరావు మాట్లాడుతూ ఎన్నికలకు ముందు సిఎం జగన్మోహన్ రెడ్డి ఇచ్చిన హామీల్లో ఒక్కటి కూడా అమలు కాలేదని విమర్శించారు. తోటపల్లి ,జంఝావతి సాగునీటి ప్రాజెక్టులు పూర్తి చేస్తామని చెప్పినా, వాటికి అందుకు




కురుపాం సభకు హాజరైన జనం, మాట్లాడుతున్న వి.శ్రీనివాసరావు

అనుగుణంగా నిధులు కేటాయించలేదన్నారు. 14 ఏళ్ల క్రితం సిపిఎం ఒత్తిడితో తలపెట్టిన పూర్ణపాడు లాబేసు వంతెన నిర్మాణాన్ని కూడా చేపట్టలేదని, దీంతో గిరిజనులు ఎంతో ప్రయాస పడుతున్నారని అన్నారు. దీనిపై స్థానిక ఎమ్మెల్యే పుష్ప శ్రీవాణి సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. వారు నివాసం ఉంటున్న మేరంగి రోడ్డు కూడా దారుణంగా ఉండడం సిగ్గుచేటు అన్నారు. ఎమ్మెల్యేలు, మంత్రుల నిర్లక్ష్యం వల్ల సీతానగరం బ్రిడ్జి నిర్మాణం కూడా అసంపూర్తిగానే మిగిలిపోయిందని విమర్శించారు.

ఏజెన్సీలు ఏనుగుల విధ్వంసంతో ప్రజలు భయాందోళనకు గురవుతున్నా పట్టించుకోలేదన్నారు ఏజెన్సీలో జీడి పిక్కల ప్రాసెసింగ్ యూనిట్ ఏర్పాటు పార్వతీపురంలో తాగునీరు, ట్రాఫిక్ సమస్య పై ఇచ్చిన హామీలు నెరవేరలేదని గుర్తు చేశారు. సీతానగరంలో ఎన్‌సిఎస్ సుగర్స్ ను సహకార రంగంలోకి తీసుకొస్తామని చెప్పినప్పటికీ రైతులు బకాయిల తీర్చేందుకు ఏకంగా పరిశ్రమ భూమినే విక్రయించారని అన్నారు. సిపిఎం సీనియర్ నాయకులు ఎం.కృష్ణమూర్తి మాట్లాడుతూ రాష్ట్ర విభజన తర్వాత పార్వతీపురం మన్యం జిల్లాలో ఒక్క అభివృద్ధి కార్యక్రమం కూడా చేపట్లేదని ఆవేదన వ్యక్తంచేశారు. స్థానిక ఎమ్మెల్యేలు, మంత్రులు రియల్ ఎస్టేట్ వ్యాపారులుగా మారిపోయారని విమర్శించారు. జిల్లాలో సమస్యలపైన, అభివృద్ధి కోసం సిపిఎం నిర్దిష్టమైన ప్రణాళికతో ప్రజల ముందుకు సాగుతుందని అన్నారు. ఇందుకు ప్రజలు తోడైతే మేలు జరుగుతుందని అన్నారు. ఐద్వా నాయకులు హైమావతి మాట్లాడుతూ రాష్ట్రంలో మహిళలకు భద్రత లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. రైతు సంఘం రాష్ట్రఉపాధ్యక్షులు మర్రాపు సూర్యనారాయణ మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా 420 మండలాల్లో వర్షాభావ పరిస్థితులు ఉన్నాయని అన్నారు. కానీ ప్రభుత్వం కరువు మండలాలుగా గుర్తించేందుకు మీనమేషాలు లెక్కిస్తుందన్నారు. కార్యక్రమంలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు కిల్లో సురేంద్ర, కె.సుబ్బరావమ్మ, రాష్ట్ర కమిటీ సభ్యులు ఎ.అశోక్, దడాల సుబ్బారావు, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎం. తిరుపతిరావు వై .మన్మథరావు, కె. గంగునాయుడు, జిల్లా కమిటీ సభ్యులు ఎం.శ్రీనివాసరావు, కోరాడ ఈశ్వరరావు, ఎంపిటిసిలు ఎం.రమణ, బి.ఎర్రమ్మ తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారంలో ప్రభుత్వాలు విఫలం

సీతంపేట : ప్రజా సమస్యల పరిష్కారంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పూర్తిగా విఫలమయ్యాయని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు కె.సుబ్బారావమ్మ అన్నారు. సిపిఎం నాయకులు చేపట్టిన ప్రజారక్షణ భేరి బస్సు యాత్రను సోమవారం స్థానిక పార్కు సమీపాన ఆమె జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సుబ్బారావమ్మ మాట్లాడుతూ కేంద్రంలోని బిజెపి చుట్టూ రాష్ట్రంలోని వైసిపి, టిడిపి, జనసేన తిరుగుతున్నాయని, బిజెపి ఇప్పటికే రాష్ట్రాన్ని మోసగించిందన్నారు. రాష్ట్రంలో ఖాళీపోస్టులు భర్తీ చేయకపోవడంతో నిరుద్యోగ యువత రోడ్డున పడ్డారని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం సవరభాష విద్యా వాలంటీర్ల సంఘం రాష్ట్ర కార్యదర్శి సవర డోంబు, ఆ సంఘ నాయకులు వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కిల్లో సురేందర్, మర్రాపు సూర్యనారాయణ, జిల్లా కార్యదర్శి రెడ్డి వేణు, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎం.తిరుపతిరావు, జిల్లా కమిటీ సభ్యులు హైమావతి, మండల కార్యదర్శి భాస్కరరావు, సర్పంచులు సుందరమ్మ, వీరన్న పాల్గొన్నారు.

పాలకొండ : బిజెపికి ప్రత్యామ్నాయం రాష్ట్రంలో సిపిఎం అని ఆ పార్టీ రాష్ట్ర సీనియర్ నాయకులు మర్రాపు సూర్యనారాయణ అన్నారు. పాలకొండ చేరిన బస్సుయాత్రకు స్థానిక ఆటో స్టాండ్ దగ్గర సిపిఎం మండల నాయకులు దావాల రమణారావు, లక్ష్మణరావు, కె.రాము, ప్రభాకర్, అమరవేణి, తదితరులు స్వాగతం పలికారు. పెద్ద ఎత్తున ప్రజలంతా హాజరు కావాలని పిలుపునిచ్చారు.

ప్రజా రక్షణ భేరి యాత్రకు ఘనస్వాగతం

పార్వతీపురం రూరల్, టౌన్ : ప్రజారక్షణభేరి పట్టణానికి చేరుకుంది. జాతా బృందానికి జిల్లా పార్టీ కార్యవర్గంతోపాటు ప్రజాసంఘా ల సభ్యులు ఘనస్వాగతం పలికారు. పూలమాలలు వేసి తిలకాలు దిద్ది ఆహ్వానం పలికారు. కోలాట బృందం కొత్తవలస ఫ్లైఓవర్ నుండి పాతబస్టాండ్ సభాస్థలి వరకూ వానమపక్షాల పాటలకు నృత్యాలు చేస్తూ స్వాగతం పలికారు. అనంతరం ప్రజానాట్యమండలి యువకులు చేసిన నృత్యాలు సభికులను ఆకట్టుకున్నాయి. అనంతరం జిల్లా కార్యదర్శి రెడ్డి వేణు అధ్యక్షతన జరిగిన బహిరంగ సభలో నాయకులు ప్రసంగించారు.

ప్రజాశక్తి
www.prajasakti.com



పట్టణంలో ర్యాలీ నిర్వహిస్తున్న పోలీసులు

కొవ్వొత్తులతో పోలీసుల ర్యాలీ

ప్రజాశక్తి -పార్వతీపురంరూరల్

జిల్లాలో పోలీసు అమరుల స్మారక ఉత్సవాల్లో భాగంగా సోమవారం పట్టణ సిఐ పివి కృష్ణారావు ఆధ్వర్యంలో పార్వతీపురం ప్రధాన రహదారిలో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజా రక్షణే ధ్యేయంగా ప్రాణాలను కూడా పణంగా పెట్టి విధి నిర్వహణలో మరణించిన పోలీసుల అమరవీరులను అనునిత్యం స్మరించుకుంటూ వారి స్ఫూర్తితో శాంతి భద్రతల నిర్వాహణలో పునరంకితం అవుతామని తెలిపారు. పాత బస్ స్టాండ్ నుండి 4 రోడ్ జంక్షన్ వరకు నిర్వహించిన ఈ ర్యాలీలో పోలీసు అధికారులు, సిబ్బంది, ప్రజలు పాల్గొని పోలీసు అమరుల చిత్రపటాలకు నివాళ్లు అర్పించారు. కార్యక్రమంలో ఆర్ఐ కుమార్, శ్రీనివాసరావు, పట్టణ ఎస్ఐ దినకర్, సిబ్బంది పాల్గొన్నారు.

పకడ్బందీగా పరీక్షలు

ప్రజాశక్తి - వీరఘట్టం

నవంబర్ 3న స్టేట్ ఎడ్యుకేషనల్ అచీవ్‌మెంట్ సర్వీస్ పరీక్ష పగడ్బందీగా నిర్వహించాలని ఎంఇఒ ఆర్.ఆనందరావు సిబ్బందిని ఆదేశించారు. సోమవారం స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాల (బాలుర)లో శిక్షణ కార్యక్రమం పాల్గొని మాట్లాడారు. పరీక్ష ఎలా నిర్వహించాలి, ఒఎంఆర్ షీట్ విద్యార్థులు ఎలా నింపాలనే అంశంపై క్షుణ్ణంగా వివరించారు. మండలంలోని 24 పాఠశాలలకు సంబంధించి 39 తరగతి గదుల్లో 3,6,9 తరగతులు విద్యార్థులకు పరీక్ష నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో ఆయా పాఠశాలల ప్రధాన ఉపాధ్యాయులు, ఫీల్డ్ ఇన్వెజిలెటర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

'భవిష్యత్తుకు గ్యారెంటీ'కి సిద్ధం కావాలి

ప్రజాశక్తి - సీతంపేట

ఈనెల 1నుంచి భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమం పున:ప్రారంభించనున్నట్టు పాలకొండ నియోజకవర్గ టిడిపి నాయకులు పడాల భూదేవి తెలిపారు. సోమవారం సీతంపేటలోని తన క్యాంపు కార్యాలయంలో టిడిపి నాయకులకు దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా భవిష్యత్తుకు గ్యారెంటీ బాబు ష్యూరిటీ పై చర్చించారు. చంద్రబాబు నాయుడు అరెస్ట్‌తో నిలిచిన కార్యక్రమాన్ని టిడిపి జాతీయ కార్యదర్శి నారా లోకేష్ ఆధ్వర్యంలో కొనసాగుతోందన్నారు. అందుకు టిడిపి నాయకులు, కార్యకర్తలు సమాయత్తం కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు, యువకులు ఉన్నారు.



షాపులకు తాళాలు వేస్తున్న రెవెన్యూ సిబ్బంది

అద్దెలు చెల్లించని షాపులకు తాళాలు

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

స్థానిక మున్సిపల్ కార్యాలయం పక్కనే ఉన్న మున్సిపల్ ఐడిఎస్ఎంటి వాణిజ్య సముదాయంలో ఉన్న పలు షాపులకు సంబంధించిన యజమానులు అద్దెలు చెల్లించకుండా మున్సిపల్ రెవెన్యూ విభాగానికి అద్దె బకాయిలు ఉండడంతో సోమవారం మున్సిపల్ కమిషనర్ జె. రామ అప్పలనాయుడు ఆదేశాల మేరకు రెవెన్యూ విభాగం అధికారి దిబ్బా రూబెన్స్, రెవెన్యూ ఇన్స్పెక్టర్ పి.నారాయణరావు సిబ్బందితో కలిసి అద్దె బకాయిలపడ్డ పలు షాపులకు తాళాలు వేశారు. ఈ సందర్భంగా రెవెన్యూ అధికారి రూబేన్ మాట్లాడుతూ, షాపులకు అద్దె బకాయిలు పడ్డ యజమానులు రెండు మూడు రోజుల్లో అద్దెలు చెల్లించాలని, లేనిచో సంబంధిత యజమానులపై మున్సిపల్ నిబంధన రీత్యా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

విద్యార్థులకు నేత్ర పరీక్షలు

ప్రజాశక్తి - పాలకొండ

మండలంలో చిన్నమంగళాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 190 మంది విద్యార్థులకు సోమవారం కంటి పరీక్షలు చేశారు. సీతంపేట మండలం కుసిమి ప్రాథమిక వైద్య ఆరోగ్య కేంద్రం కంటి వైద్యులు కృష్ణారావు వైద్య పరీక్షలు జరిపి జాగ్రత్తలు చెప్పారు. 8 మంది విద్యార్థులకు వైఎస్సార్ ఆరోగ్య సురక్ష ద్వారా కళ్లజోళ్లు అందించారు. కార్యక్రమంలో హెచ్ఎం జామ రవి, ఉపాధ్యాయులు ఉమామహేశ్వరరావు, గౌరీశంకర్, అనిల్ కుమార్, భాస్కరరావు, సూర్యం, తదితరులు ఉన్నారు.

గొట్టమంగళాపురంలో గడపగడపకు..

ప్రజాశక్తి -పాలకొండ

మండలంలోని గొట్టమంగళాపురంలో సోమవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి ఆధ్వర్యాన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె గ్రామస్తులను సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాల వివరాలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఎంపిపి బొమ్మాళి భాను, వైస్ ఎంపిపిలు కనపాక సూర్యప్రకాష్, వాకమూడి అనిల్‌కుమార్, ఎంపిడిఒ, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కార్యకర్తకు షోకాజ్

ప్రజాశక్తి - బెలగాం

స్థానిక ఐసిడిఎస్ ప్రాజెక్టు, 13వ వార్డు, బైపాస్ కాలనీ-2, అంగన్ వాడీ కార్యకర్త బి. శ్రీదేవికి షోకాజు నోటీసు జారీ చేసినట్లు ప్రాజెక్టు అధికారి బి.శ్రీనివాసరావు తెలిపారు. బిజెపి జిల్లా అధ్యక్షులు ద్వారపురెడ్డి శ్రీనివాసరావు చేసిన ఫిర్యాదు మేరకు విచారణ నిర్వహించగా, విచారణలో పలు లోపాలు గుర్తించామన్నారు. గుర్తించిన లోపాలపై మూడు రోజుల్లోగా సంజాయిషీ ఇవ్వాల్సిందిగా ఆదేశించినట్టు తెలిపారు.

గొరడలో ఉచిత పశు వైద్య శిబిరం

ప్రజాశక్తి -గుమ్మలక్ష్మీపురం

మండలంలోని గొరడలో ఉచిత పశు వైద్యశిబిరాన్ని నిర్వహించారు. శీతాకాలంలో పశువులు, మేకలకు, గొర్రెలకు అనేక రకాల వ్యాధులు వచ్చే అవకాశం ఉందని రైతులు అప్రమత్తంగా ఉండాలని పశువైద్యాధికారి పేకాపు లక్ష్మణరావు సూచించారు. వీటికి అవసరమైన మందులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో మాతోట జట్టు కోఆర్డినేటర్ ప్రబోధ్, వెటర్నరీ సహాయకులు, రైతులు ఉన్నారు.

టెన్త్ పరీక్షలకు ఫీజు చెల్లింపు

ప్రజాశక్తి -పార్వతీపురం

పదో తరగతి రెగ్యులర్, ప్రైవేటు విద్యార్థుల పరీక్ష ఫీజులను ప్రధానోపాధ్యాయులు నవంబరు 10లోగా చెల్లించాలని జిల్లా విద్యాశాఖాధికారి ఎన్.ప్రేమ్ కుమార్ తెలిపారు. రూ.50 అపరాధరుసుంతో నవంబర్ 16 వరకు, రూ.200 అపరాద రుసుంతో 22వరకు, రూ.500 అపరాధ రుసుంతో నవంబరు 30 వరకు చెల్లించవచ్చునని తెలిపారు. ఎస్‌సి, ఎస్‌టి, బిసిలకు చెందిన రెగ్యులర్ విద్యార్థుల తల్లిదండ్రుల వార్షికాదాయం పట్టణంలో రూ.24 వేలు, గ్రామీణంలో రూ.20వేలు లోపు గల వారికి ఫీజు మినహాయింపు ఉంటుందని తెలిపారు.

మళ్లీ వచ్చిన గజరాజులు

ప్రజాశక్తి - భామిని

మండలంలోని గత ఐదు నెలల పాటు కనిపించని ఏనుగులు సోమవారం బాలేరు, నల్లారాయిగూడ పంచాయతీ పరిధిలో గల ఇసుకగూడ, సన్నాయిగూడ జీడీతోటలో 4 ఏనుగుల గుంపు సంచారిస్తున్నాయి. ప్రస్తుతం వరి, వాణిజ్య పంటలైన చెరకు ఏపుగా పెరిగిన నేపథ్యంలో ఏనుగులు కదలికలపై రైతులు ఆందోళన చెందుతున్నారు. వంశధార కుడి కాలువ అవతలి వైపు వున్న ఏనుగులు, కాలువ వంతెన మీదుగా దాటితే, మండలంలోని మైదాన ప్రాంతంలో పంటలు నాశనం చేసే అవకాశం ఉందని రైతులు తెలిపారు.

స్ఫూర్తిదాయకం... గిరిజన రైతాంగ పోరాటం

భూమి కోసం.. భుక్తి కోసం ఈ ప్రాంతంలో ప్రతి దిక్కు నినదించింది. సిక్కోలులో 1960 దశకంలో దిక్కులు పిక్కటిల్లేలా 56 ఏళ్ల క్రితం ఇదే రోజున శ్రీకాకుళ రైతాంగ ఉద్యమానికి అంకురార్పణ జరిగింది. ఆ ఉద్యమం గిరిజన గూడేలంతటా విస్తరించింది. క్రమంగా గిరిజనులకు పలుహక్కులు సంక్రమించాయి. మంగళవారం కోరన్న, మంగన్న 56వ వర్ధంతి సందర్భంగా ప్రత్యేక కథనం..

- అమరవీరుల త్యాగఫలమే నేటి గిరిజనాభివృద్ధి
- నేడు కోరన్న, మంగన్న 56వ వర్ధంతి
- మామిడిమానుగూడలో సభ

ప్రజాశక్తి-కురుపాం/గుమ్మలక్ష్మీపురం

వెట్టిచాకిరీ నుంచి విముక్తి కోసం... దున్నేవాడిదే భూమి అనే నినాదంతో భూస్వాములకు వ్యతిరేకంగా 1967 అక్టోబర్ 31న మొండెంఖల్‌లో కమ్యూనిస్టు పార్టీ బహిరంగ సభ ఏర్పాటు చేసింది. ఈ సభకు విద్యార్థులు, మహిళలు, గిరిజనులు పిల్లాపాపలతో సభకు వెళ్తున్నారు. ఈ సభను భగ్నం చేయాలని పలువురు భూస్వాములు పి.లేవిడి వద్ద ఆదివాసీలపై దాడులు చేశారు. ఆనాటి భూస్వాముల కాల్పుల్లో ఇద్దరు ఆదివాసీ యువకులు మరణించారు. వారే శ్రీకాకుళం గిరిజన రైతాంగ ఉద్యమం తొలి అమరవీరులు ఆరిక కోరన్న, కొండగొర్రె మంగన్న. విజయనగరం జిల్లాలోని కొంత ప్రాంతం అనాటి శ్రీకాకుళం జిల్లాలో ఉండేది. ఇందులో అధిక శాతం భూమి జమీందారులు, సంస్థానాధీశుల ఆధీనంలో ఉండేది. ఆదివాసీలకు అక్షర జ్ఞానం లేక అంకెలు తెలియకపోవడంతో భూస్వాముల దోపిడీకి వరంగా మారింది. భూస్వాముల వెట్టిచాకిరీ నుంచి గిరిజనులకు విముక్తి కల్పించడానికి పలు పోరాటాలు జరిగాయి. గిరిజనులను చైతన్య పరచడానికి కమ్యూనిస్టు పార్టీ ఆధ్వర్యంలో గిరిజన సంఘం ఏర్పాటు చేసి ఉద్యమాలకు ఊపిరి పోశారు. పల్లెరక రాములు, వెంపటాపు సత్యం, ఆదిభట్ల కైలాసం తదితరులు ముందుండి ఉద్యమాలను నడిపించారు. 1971 వరకు వివిధ దశల్లో ఉద్యమాలు జరిగాయి. వెంపటాపు సత్యం, ఆదిభట్ల కైలాసం పోలీసు తూటాలకు బలైపోయారు. ఆరిక గుంపస్వామి, కొండగొర్రె లచ్చన్న, కృష్ణమూర్తి, శ్రీరాములు, వసంత, రఘు, రాములు తదితరులు జైలుపాలయ్యారు. ఆనాటి ఉద్యమకారులు త్యాగఫలంగా గానే ఐటిడిఎ, జిసిసి ఏర్పాటయ్యాయి. గిరిజనులకు అటవీ హక్కుల చట్టం వచ్చింది.



హక్కులను కాలరాసేందుకు కుట్ర

పోరాట ఫలితంగా గిరిజనులు సాధించుకున్న హక్కులను నేటి పాలకులు కాల రాయడానికి కుట్రలు చేస్తూనే ఉన్నారు. కేంద్రంలోని మతోన్మాద బిజెపి ప్రభుత్వం ఒక అడుగు ముందుకు వేసి అడవి తల్లి ఒడిలో బతుకుతున్న గిరిజనులను అక్కడి నుంచి వెళ్లగొట్టేందుకు కుట్రలు పన్నింది. ఏజెన్సీలో ఖనిజ సంపదను కొల్లగొట్టేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రయత్నిస్తున్నాయి. సిపిఎం, గిరిజన సంఘం ఆధ్వర్యాన పోరాటాలు చేసి ఆ ప్రయత్నాలను అడ్డుకున్నాయి. యుపిఎ హయాంలో వామపక్షాల చొరవతో వచ్చిన అటవీ హక్కుల చట్టాన్ని పగడ్బందీగా అమలు చేయాల్సిన బిజెపి ప్రభుత్వం ఆ చట్టాన్ని నీరుగార్చే చర్యలకు ఒడిగట్టింది. అడవిని నమ్ముకుని జీవిస్తున్న గిరిజనులకు భూములపై హక్కులు లేకుండా చేయాలని చూస్తోంది.

నేడు మామిడిమానుగూడలో కోరన్న, మంగన్న వర్ధంతి సభ

నీలకంఠాపురం పంచాయతీ మామిడిమానుగూడలో మంగళవారం శ్రీకాకుళం గిరిజన రైతాంగ పోరాట అమర వీరులు కోరన్న, మంగన్నల 56వ వర్ధంతి సభ నిర్వహిస్తున్నామని, జిల్లాలోని ఆదివాసీ గిరిజనులంతా పాల్గొని జయప్రదం చేయాలని ఆ సంఘం నాయకులు బిడ్డిక వెంకటరావు, బిడ్డిక నాగేశ్వరరావు కోరారు.

త్వరలో పత్తి కొనుగోలు కేంద్రాలు

ప్రజాశక్తి - పాచిపెంట

త్వరలోనే పత్తి కొనుగోలు కేంద్రాలు ప్రారంభమవుతాయని, పొడవు పింజె పత్తి రూ.7020, పొట్టి పింజ పత్తి రూ.6620కు ప్రభుత్వం కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా ద్వారా కొనుగోలు చేపడుతుందని మండల వ్యవసాయ అధికారి కె.తిరుపతిరావు అన్నారు. మండల వ్యవసాయ కార్యాలయంలో ఏర్పాటు చేసిన గ్రామ వ్యవసాయ సహాయకుల సమావేశంలో మాట్లాడుతూ మండలంలో 2660 ఎకరాల్లో పత్తి పంట వేశారని, గత నెల రోజులుగా వర్షాల్లేకపోవడంతో పత్తి కూడా నాణ్యతతో కూడి ఉందని కాబట్టి గ్రామ వ్యవసాయ సహాయకులంతా రైతులకు తెలియజేయాలని అన్నారు. కొనుగోలు కేంద్రాలకు పత్తిని ఇవ్వటానికి సిద్ధంగా ఉన్న రైతుల వివరాలను సిఎం యాప్‌లో నమోదు చేయాలని తెలిపారు. పత్తి పంట కొనుగోలులో రైతులందరికీ తెలియజేయాలని కోరారు. పత్తి పంట కొనుగోలు సాలూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ద్వారా జరుగుతుందని రైతులు ఆర్‌బికెల్లో రిజిస్ట్రేషన్ చేసుకుని సిద్ధంగా ఉండాలని తెలిపారు. కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సహాయకులు పాల్గొన్నారు.

సమస్యకు తక్షణ పరిష్కారం

ప్రజాశక్తి - బెలగాం

జగనన్న కు చెబుదాం కార్యక్రమం ద్వారా ప్రజల సమస్యలకు తక్షణ పరిష్కారం లభిస్తుంది. సోమవారం కలెక్టర్ కార్యాలయంలో జరిగిన జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో కలెక్టర్ నిశాంత్ కుమార్ ప్రజా సమస్యల పరిష్కారం కొరకు నేరుగా సంబంధిత అధికారులతో మాట్లాడి పరిష్కారానికి అదేశాలు జారీ చేశారు. పార్వతీపురం పట్టణం, బందమర్రి వీధికి చెందిన ఓలేటి గౌరి, కొమరాడ మండలం దేవునిగుంపలో గల 1.74 ఎకరాల భూమి 1బి ఆధార్ లింక్ చేయమని కోరుతూ, మూడు నెలలుగా సచివాలయం, మండల కార్యాలయం చుట్టూ తిరుగుతున్నానని, ఆధార్ లింక్ కాకపోవడం వల్ల ప్రభుత్వం అందిస్తున్న పథకాలు పొందలేకపోతున్నానని కలెక్టర్‌కు జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో తెలుపగా, జిల్లా కలెక్టర్ వెంటనే రెవిన్యూ అధికారులతో మాట్లాడి ఆధార్ లింక్ చేయించారు. అనేక రోజులుగా పరిష్కారం కాని సమస్యకు నిముషాల్లో పరిష్కారం లభించడంతో ఓలేటి గౌరి సంతోషం వ్యక్తం చేస్తూ జిల్లా కలెక్టర్‌కు, జగనన్న కు చెబుదాం కార్యక్రమం ద్వారా ప్రజల సమస్యలకు పరిష్కారం చూపుతున్న ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు.

నేడు గాయత్రి డిగ్రీ కళాశాలలో జాబ్ మేళా

పార్వతీపురం టౌన్ : పట్టణంలోని గాయత్రి డిగ్రీ కళాశాలలో మంగళవారం జాబ్ మేళా నిర్వహిస్తున్నట్టు ఆ కళాశాల కరస్పాండెంట్ పివికె మణికుమార్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ జాబ్ మేళాలో డెక్కన్ ఫైన్ కెమికల్స్, నవత ట్రాన్స్పోర్ట్, ముత్తూట్ ఫైనాన్స్, హీరో కార్పొరేషన్, పేటియం మొదలగు సంస్థల వారు.. వారి వారి సంస్థల్లో ఉద్యోగాల కోసం ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ ఇంటర్వ్యూల్లో పదవ తరగతి, ఐటిఐ, డిప్లమో, ఇంటర్మీడియట్, డిగ్రీ, ఎంబిఎ, ఎంసిఎ ఉత్తీర్ణులైన ఆసక్తి గల అభ్యర్థులు తమ సర్టిఫికెట్లతో పాటు మంగళవారం ఉదయం 9 గంటలకు గాయత్రి డిగ్రీ కళాశాల ఆవరణలో హాజరు కావాలన్నారు. మరిన్ని వివరాలకు 8639928622 నెంబర్‌కు సంప్రదించాలని తెలిపారు.

3,400 లీటర్ల సారా ధ్వంసం

పార్వతీపురం టౌన్ : పట్టణ శివారులోని నవిరి కాలనీ వద్ద ఉన్న తోటపల్లి పాత రోడ్డు వద్ద సోమవారం స్పెషల్ ఎన్ఫోర్స్మెంట్ బ్యూరో అధికారులు రెండు నెలల కాలంలో పట్టుబడిన 62 సారా కేసుల్లో సీజ్ చేసిన 3,400 లీటర్ల నాటుసారాను ఎన్ఫోర్స్మెంట్ ఇన్స్పెక్టర్ బి.ఈశ్వరరావు ఆధ్వర్యంలో ధ్వంసం చేశారు. కార్యక్రమంలో సిఐ ఎల్.ఉపేంద్ర, సిబ్బంది పాల్గొన్నారు.

జెఎఎస్‌కు విశేష స్పందన : డిఎంహెచ్ఒ

ప్రజాశక్తి - వీరఘట్టం

జగనన్న ఆరోగ్య సురక్ష (జెఎఎస్)కు విశేష స్పందన వస్తోందని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ బగాది జగన్నాథరావు అన్నారు. వీరఘట్టంలో సోమవారం ఏర్పాటు చేసిన జెఎఎస్ వైద్య శిబిరాన్ని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి తనిఖీ చేశారు. శిబిరంలో ఏర్పాటు చేసిన అన్ని కౌంటర్లను, ప్రత్యేక వైద్యుల కౌంటర్లను పరిశీలించారు. వైద్యులు, వైద్య సిబ్బందితో మాట్లాడి శిబిరంలో అందించాల్సిన వైద్య సేవలను వివరించారు. మహిళా, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పౌష్టికాహార స్టాల్‌ను సందర్శించి శిబిరానికి వచ్చే ప్రజలకు ముఖ్యంగా గర్భిణీలు, బాలింతలకు పౌష్టికాహార ప్రయోజనాలు వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో నవంబరు 10 వరకు జెఎఎస్ వైద్య శిబిరాలు జరుగుతాయని చెప్పారు. జిల్లాలో లక్షా 21వేల మంది వైద్య శిబిరాలలో వైద్య సేవలు పొందారని ఆయన చెప్పారు.

ఆసుపత్రిలో ప్రసవాలు జరగాలి

అంతకు ముందు వీరఘట్టం ఆసుపత్రిని సందర్శించిన జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి ఆసుపత్రిలో ప్రసవాలు జరగాలని స్పష్టం చేశారు. గర్భిణులకు తరచూ తనిఖీలు నిర్వహించాలని, హైరిస్క్ గర్భిణీలను గుర్తించి వారిపై ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. మాతా, శిశు మరణాలు సంభవించరాదని ఆయన పేర్కొన్నారు. ప్రసవాలు విధిగా ఆసుపత్రిలో జరగాలని, ప్రసవాలు జరగక పోతే అందుకు బాధ్యులైన వారిని సస్పెన్షన్ చేస్తామని ఆయన హెచ్చరించారు. ఖాళీగా ఉన్న స్టాఫ్ నర్స్ పోస్టు త్వరలో భర్తీకి చర్యలు తీసుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో వైఎస్ఆర్ అరోగ్య శ్రీ జిల్లా సమన్వయ అధికారి డాక్టర్ కొయ్యాన అప్పారావు, ఎంపిడిఒ వెంకట రమణ, స్థానిక వైద్యులు తదితరులు పాల్గొన్నారు.



పౌష్టికాహార స్టాల్‌ను పరిశీలిస్తున్న డిఎంహెచ్ఒ జగన్నాథరావు

విద్యుత్ స్తంభాలు వేశారు... దీపాలేవీ?

కౌన్సిల్ సమావేశంలో సభ్యుల నిలదీత

ప్రజాశక్తి - సాలూరు

పట్టణంలో చాలా చోట్ల కొత్త విద్యుత్ స్తంభాలు వేశారని, దీపాలు మాత్రం ఎందుకు వేయలేదని వైసిపి కౌన్సిలర్లు ప్రశ్నించారు. సోమవారం మున్సిపల్ చైర్‌పర్సన్ పువ్వల ఈశ్వరమ్మ అధ్యక్షతన జరిగిన సాధారణ సమావేశంలో కౌన్సిలర్లు గొర్లి వెంకటరమణ, పప్పల లక్ష్మణరావు, రాపాక మాధవరావు విద్యుత్ సమస్యలపై మాట్లాడారు. పట్టణంలో కొన్ని ప్రదేశాలలో విద్యుత్ స్తంభాలు వేశారని, కానీ వాటిని కాంక్రీటు లేకుండా వేయడంతో అవి కిందకు పడిపోయే స్థితిలో ఉన్నాయని చెప్పారు. స్తంభాలు వేసి చాలా కాలమైనా దీపాలు ఎందుకు వెలిగించలేదని నిలదీశారు. సమావేశాలకు విద్యుత్‌శాఖ అధికారులు ఎందుకు రావడం లేదని ప్రశ్నించారు. దీనిపై కమిషనర్ టి.జయరాం మాట్లాడుతూ విద్యుత్ అధికారులతో చర్చించి సమస్యలు పరిష్కరిస్తామని చెప్పారు. పట్టణంలో అంబేద్కర్ విగ్రహం ఏర్పాటుకు అనుమతి మంజూరు చేయాలని కౌన్సిలర్లు సింగారపు ఈశ్వరరావు, జి.వరప్రసాద్ కోరారు. అనంతరం సభ్యులు అజెండాను ఆమోదించారు. ఈ సమావేశంలో వైస్ చైర్మన్లు జర్జాపు దీప్తి, వంగపండు అప్పలనాయుడు, కౌన్సిలర్లు గిరి రఘు, ఫ్లోర్ లీడర్ గొర్లి జగన్మోహన్ రావు, ఎఇ సూరి నాయుడు పాల్గొన్నారు.

విద్యుత్ స్తంభాలకు వైరింగ్ త్వరగా చేయండి

మున్సిపాలిటీ లో కొత్త గా వేసిన విద్యుత్ స్తంభాలకు వైరింగ్ త్వరగా చేయాలని చైర్ పర్సన్ పువ్వల ఈశ్వరమ్మ కోరారు. సోమవారం తన ఛాంబర్లో విద్యుత్ శాఖ ఎడిఇ రంగారావు, ఎఇ సింహాచలంతో కమిషనర్ టి.జయరాం సమక్షంలో సమీక్ష నిర్వహించారు. స్తంభాలు వేసి వదిలేశారని, వాటికి కాంక్రీటు చేయకపోవడంతో నేలపై పడిపోయే ప్రమాదం వుందని చెప్పారు. పట్టణంలో 29వార్డుల్లో 52 స్తంభాలకు 46 స్తంభాలు వేసినట్లు ఎడిఇ రంగారావు తెలిపారు. మిగిలిన ఆరు స్తంభాలు 15రోజుల్లో వేస్తామని చెప్పారు. వెంటనే సమస్యలు పరిష్కరించాలని చైర్ పర్సన్ ఆదేశించారు.

పక్కా ప్రణాళికతో ఆరోగ్య కార్యక్రమాలు

ప్రజాశక్తి - సీతానగరం

ఆరోగ్య కార్యక్రమాలు పక్కా ప్రణాళికతో నిర్వర్తించి, ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు కృషి చేయాలని జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి (డిఐఒ) డాక్టర్ టి. జగన్మోహనరావు సూచించారు. ఈ మేరకు ఆయన సీతానగరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సోమవారం ఆకస్మికంగా సందర్శించారు. పలు ఆరోగ్య సమస్యలతో ఆసుపత్రికి వచ్చిన వారికి తనిఖీలు జరుగుతున్న తీరును పరిశీలించారు. వార్డులో అందజేస్తున్న చికిత్సను తనిఖీ చేసి, రోగులతో మాట్లాడి వారి ఆరోగ్య స్థితిని పరిశీలించి, ఆరోగ్య సలహాలు ఇచ్చారు. ఐరన్ సుక్రోజ్ ఇంజెక్షన్ కోసం వచ్చిన గర్భిణీతో మాట్లాడి ఆరోగ్య వివరాలపై వైద్య సిబ్బందిని ఆరా తీశారు. అనంతరం అక్కడ నిర్వహించిన సమావేశంలో పలు ఆరోగ్య కార్యక్రమాలపై సమీక్ష జరిపారు. కార్యక్రమంలో వైద్యాధికారులు డాక్టర్ కె.శిరీష ,ఉషారాణి, సూపర్ వైజర్లు కె.సత్యవతి, జయగౌడ్, ఎఎన్ఎంలు, వైద్య సిబ్బంది తదితరులు ఉన్నారు.

దోమపోటుకు కోరోగన్ మందు పిచికారీ

ప్రజాశక్తి - సాలూరురూరల్

వరిలో దోమపోటుకు కోరోగన్ మందు పిచికారి చేయాలని ఆచార్య ఎన్‌జి రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం శాస్త్రవేత్త ప్రొఫెసర్ ఎంవివి శ్రీనివాస్ సూచించారు. మండలంలోని మరిపల్లి పంచాయతీ గంగన్నదొరవలసలో సమీకృత వ్యవసాయ విధానాల ద్వారా పండిస్తున్న వరి పంట పొలాలను సోమవారం ఆయన పరిశీలించారు. అనంతరం రైతులనుద్దేశించి ఆయన మాట్లాడుతూ గంగన్నదొర వలస, ముంగివాణివలస, మెట్టవలస ప్రాంతాలలో సమీకృత వ్యవసాయ విధానం ద్వారా వ్యవసాయం చేస్తున్నారని, ఈ విధానం ద్వారా వ్యవసాయ పెట్టుబడులు తగ్గి, ఆదాయం పెరుగుతుందని అన్నారు. మంచి మద్దతు ధర కూడా వస్తుందన్నారు. సన్నకారు రైతులు పెరటి తోటలు, కోళ్లను పెంచుకోవడం వల్ల అదనపు ఆదాయం వస్తుందన్నారు. ఇప్పుడు వరిలో దోమపోటు వల్ల పొట్ట దశలో వచ్చే వ్యాధులను గుర్తించి వాటికి సరిపడా మందులను పిచికారి చేయాలన్నారు. కార్యక్రమంలో ఐఫ్ఎస్ శాస్త్రవేత్త అబ్దుల్ సలామ్, ఐఫ్ఎస్ ఎఇ నాగేశ్వరరావు, రైతులు నూకరాజు, రామకష్ణ, వెంకటరమణ, పాపారావు, ఆదినారాయణ పాల్గొన్నారు.

ఎంఇఒకు సన్మానం

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

మండలంలోని ఇజ్జకాయి ప్రభుత్వ పాఠశాల పైకప్పు నిర్మాణానికి రూ.25వేలు ఆర్థికంగా విరాళం అందజేసిన ఎంఇఒ చంద్రశేఖర్ సేవలు అభినందనీయమని పలువురు ఉపాధ్యాయులు కొనియాడారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం ఎంఇఒను ఘనంగా సన్మానించారు. భారీ ఈదురు గాలులకు ఇజ్జకాయి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల పైకప్పు రేకులు పూర్తిగా ఎగిరిపోవడంతో విద్యార్థులు చదువుకు ఆటంకంగా మారింది. ఈ విషయాన్ని ఎంఇఒ దృష్టికి గ్రామస్తులు తీసుకొచ్చారు. స్పందించిన ఎంఇఒ గ్రామానికి వెళ్లి పాఠశాల పునర్మాణానికి రూ.25 వేలు ఆర్థిక సహాయం చేశారు. ఈ సన్మాన కార్యక్రమంలో ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర అధ్యక్షులు పాలక దేవానంద్, యుటిఎఫ్ మండల అధ్యక్షులు పత్తిక ప్రసాదరావు, హెచ్ఎంలు బిడ్డిక భీముడు, జ్ఞాన ప్రకాష్ తదితరులు ఉన్నారు.

రక్తహీనతపై దృష్టిసారించాలి

పార్వతీపురం : కిశోర బాలల్లో రక్త హీనతపై దృష్టి సారించాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ బి.జగన్నాథరావు అన్నారు. ప్రోగ్రాం అధికారుతో సోమవారం జిల్లా వైద్య ఆరోగ్య కార్యాలయంలో పలు ఆరోగ్య కార్యక్రమాలపై ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ జగన్నాథరావు మాట్లాడుతూ ప్రోగ్రాం అధికారులు వారి పరిధిలో ఉండే ఆరోగ్య కేంద్రాల్లో నిర్దేశించిన అన్ని ప్రభుత్వ ఆరోగ్య కార్యక్రమాలు పూర్తి స్థాయిలో జరిగేలా చర్యలు చేపట్టి, ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలన్నారు. ఆర్‌సిహెచ్‌లో మాతా,శిశు ఆరోగ్య కార్యక్రమాల నమోదు, గర్భిణీలకు మొదటి త్రైమాసికంలో త్వరితగతిన నమోదు (రిజిస్ట్రేషన్) జరిగేలా, హైరిస్క్ గర్భిణీలను గుర్తించి పర్యవేక్షణ, వారికి పూర్తి స్థాయిలో ఆరోగ్య తనిఖీలు జరగాలని సూచించారు. మొదటి కాన్పు, ఆడ శిశువు జన్మించిన రెండో కాన్పుకు ప్రభుత్వం అందజేస్తున్న ప్రధానమంత్రి మాతత్వ వందన యోజన (పిఎంఎంవివై) పథకం అర్హులందరికీ చేరేలా త్వరితగతిన చర్యలు చేపట్టాలని ఆదేశించారు. గర్భిణులకు టిటి టీకా రెండు డోసులు, ఐదేళ్లలోపు పిల్లలందరికీ షెడ్యూల్ ప్రకారం టీకా పూర్తి చేసి ఆర్సిహెచ్, యూవిన్‌లో నమోదు జరిగేలా చూడాలని పేర్కొన్నారు. స్కూల్ హెల్త్ కార్యక్రమంలో భాగంగా ప్రోగ్రాం అధికారులు వారి పరిధిలో ఉండే అన్ని పాఠశాలలు, కళాశాలల్లో విద్యార్థులకు ఆరోగ్య తనిఖీ పూర్తయ్యేలా చర్యలు చేపట్టాలన్నారు. 10 నుంచి 19 ఏళ్ల కిశోర బాలికల్లో రక్త హీనత నివారణపై దృష్టి సారించాలని ఆయన స్పష్టం చేశారు. అందుకు సంబంధించి ఆయా పాఠశాలల ఉపాధ్యాయులతో సమన్వయం జరిపి నివేదికలు సిద్ధం చేయాలని సూచించారు. జెఎఎస్‌లో గుర్తించిన ఆరోగ్యశ్రీ రిఫరల్స్, కొత్తగా గుర్తించిన దీర్ఘకాలిక రోగులపై దృష్టి సారించాలన్నారు. దీర్ఘ కాలికంగా దగ్గు ఉన్న వారికి కఫం (క్షయ నిర్ధారణ పరీక్షలు) పరీక్షలు పక్కగా జరిగేలా చూడాలని చెప్పారు. ఆరోగ్య కార్యక్రమాల నివేదికలు పురోగతి చెందేలా కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో జిల్లా ఆర్‌బిఎస్‌కె అధికారి డాక్టర్ డి.భాస్కరరావు, జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ టి.జగన్మోహనరావు, డిఎల్ఎటిఒ డాక్టర్ శ్యామ్‌కుమార్, డిప్యూటీ డిఎంహెచ్ఒ డాక్టర్ శివకుమార్, నోడల్ అధికారి డాక్టర్ వినోద్‌కుమార్, ప్రోగ్రాం అధికారి డాక్టర్ విజయ్ మోహన్, డిపిహెచ్ఎన్ఒ ఉషారాణి, సిబ్బంది విజయలక్ష్మి , ఆదిలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

గిరిజన నిరుద్యోగులకు శిక్షణ ఇవ్వండి

ప్రజాశక్తి - బెలగాం

గిరిజన నిరుద్యోగ యువతీ, యువకులకు వివిధ ఉద్యోగాల్లో చేరేందు, సివిల్స్, గ్రూప్స్‌లో శిక్షణ ఇవ్వాలని గిరిజన విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షులు పి.సురేష్, నాయకులు బంగార్రాజు ఐటిడిఎ పిఒకు సోమవారం వినతిని అందజేశారు. అలాగే కొమరాడ మండలంలోని గిరిజన గ్రామాలకు లింకుల రహదారులు వేయాలని కోరారు.


టెక్నికల్ సర్టిఫికెట్ కోర్సులో 64.40 శాతం ఉత్తీర్ణత

ప్రజాశక్తి - పార్వతీపురం

టెక్నికల్ సర్టిఫికెట్ కోర్సు ఫలితాలు సోమవారం విడుదలైనట్లు జిల్లా విద్యాశాఖాధికారి ఎన్. ప్రేమ్ కుమార్ తెలిపారు. జూలైలో నిర్వహించిన డ్రాయింగు, హ్యాండ్లూమ్ వీవింగ్, టైలరింగ్, ఎంబ్రాయిడరీలో లోయర్, హయ్యర్ గ్రేడ్‌ల్లోని టెక్నికల్ సర్టిఫికెట్ కోర్సు ఫలితాలు విడుదల చేసినట్టు తెలిపారు. జిల్లాలో 64.40 శాతం మంది ఉత్తీర్ణత సాధించారని డిఇఒ తెలిపారు. 2,691 మంది అభ్యర్థులు పరీక్షలకు హాజరుకాగా 1,733 మంది ఉత్తీర్ణులయ్యారన్నారు. అభ్యర్థులు www.bse.ap.gov.in వైబ్ సైట్ ద్వారా మార్కుల మెమోరాండం డౌన్ లోడ్ చేసుకోవచ్చునని, పాస్ సర్టిఫికెట్లు సంబంధిత జిల్లా విద్యాశాఖాధికారులకు నేరుగా పంపబడతాయని తెలిపారు.

నేరాలు ఘోరాలు

విద్యార్థిని ఆత్మహత్య



ప్రజాశక్తి - భామిని

మండలంలోని దిమ్మిడిజోల పంచాయతీ దండాసి కాలనీ చెందిన కనపల అమృత (17) ఉరివేసుకొని సోమవారం ఆత్మహత్య చేసుకుంది. ఈ సంఘటనకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. దండాసికాలనీకి చెందిన అమృత శ్రీకాకుళం జిల్లా పాతపట్నం ట్రైబల్ వెల్ఫేర్ పోస్ట్ మెట్రిక్ హాస్టల్‌లో ఉంటూ ప్రభుత్వ జూనియర్ కాలేజీలో ఇంటర్ బైపిసి రెండో సంవత్సరం చదువుతోంది. దసరా సెలవులు అనంతరం అమృతను తల్లి ఇందిరా పాతపట్నం పోస్ట్‌మెట్రిక్ హాస్టల్‌కు దిగబెట్టింది. ఇందిరా తిరిగి ఇంటికి వచ్చే సరికి అమృత ఫ్యాన్‌కు ఉరి వేసుకొని మృతి చెందినట్టు ఫోన్ రావడంతో హుటాహుటిన కుటుంబసభ్యులతో పాతపట్నం వెళ్లింది. అమృత తండ్రి మిన్నారావు గ్రీన్ సేవ మిత్రగానూ, తల్లి ఇందిర శుభకార్యాల్లో వంట మనిషిగా జీవనం సాగిస్తున్నారు. అమృతకు ఇద్దరు తమ్ములు ఉన్నారు. పాతపట్నం సిఐ, ఎస్ఐ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. అమృత మృతితో గ్రామంలో విషాదఛాయలు అలముకున్నాయి.

కలుషిత ఆహారం తిని ఐదుగురికి అస్వస్థత

ప్రజాశక్తి - వీరఘట్టం

మండలంలోని తూడికి చెందిన మురగడాపు లక్ష్మణరావు, గౌరమ్మ, చంద్రశేఖర్, శ్యాంసుందర్రావు, రూపలు ఒకే కుటుంబానికి చెందిన వారు కలుషిత ఆహారం తిని అస్వస్థతకు గురయ్యారు. కుటుంబ సభ్యులు, గ్రామస్తులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ఈనెల 28న రాత్రి భోజనానికి తయారు చేసిన చెట్నీలో బల్లి పడిపోయినప్పటికీ వాటిని తొలగించి ఆ రాత్రి భుజించి నిద్రపోయారు. ఆ రాత్రి ఒంటిగంట సమయంలో కుటుంబ సభ్యులందరికీ వాంతులు, విరోచనాలు కావడంతో ఇరుగు, పొరుగు వారికి ఈ విషయాన్ని తెలిపారు. ఈనెల 29న 108కు గ్రామస్తులు సమాచారం ఇవ్వడంతో అస్వస్థకు గురైన వారిని పాలకొండ ప్రాంతీయ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆరోగ్యం కుదుటపడడంతో డిశ్చార్జ్ అయ్యారు. శ్యాంసుందర్రావుకు ఇప్పటికీ వాంతులు, విరోచనాలు తగ్గకపోవడంతో మెరుగైన వైద్యం కోసం ప్రైవేట ఆస్పత్రికి తరలించినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.